క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్‌లో భాగంగా మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. గొల్లపాలెం ఎస్ఎస్‌హెచ్ క్యూ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలో గొల్లపాలెం, ఆర్యావటం, మొగలిపాలెం, శలపాక, తణుకువాడ, మంజేరు, శీల, శీలలంక, ఒంటితాడి, కాజులూరు, ఐతపూడి, తిప్పరాజుపాలెం, తాళ్లరేవు మండలం బొడ్డువానిలంక, కరప మండలం గొర్రిపూడి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ లైన్లలోని గృహావసరాలతో పాటు, ఇండస్ట్రియల్ ఫీడర్, ఆక్వా చెరువులకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రాయవరం: ఎన్నికల నియమావళిని అధికారులు మండలంలో కఠినంగా అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామంలో అన్ని పార్టీలకు సంబంధించి బ్యానర్లు, వాల్ పోస్టర్లను ఇప్పటికే తొలగించారు. ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ నిఘా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా బుధవారం రాయవరం ప్రధాన రహదారిలో మండల స్థాయి అధికారులు, పోలీసులు ఉమ్మడిగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎవరైనా అధిక మొత్తంలో నగదు కలిగి ఉంటే దానిని సీజ్ చేస్తామని, సరైన ఆధారాలు కలిగి ఉంటే సంబంధిత యజమానులకు అప్పగిస్తామన్నారు. ప్రతి తనిఖీని ఎప్పటికప్పుడు వీడియో షూటింగ్ ద్వారా రికార్డు చేస్తున్నారు. తనిఖీల్లో ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, పోలీసులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి పోలీసులు రక్షణ కల్పించాలి

రాయవరం: భర్త చేతిలో తీవ్రంగా గాయపడి, రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగురాలికి పోలీసులు రక్షణ కల్పించాలని దివ్యాంగ హక్కుల చట్టం జిల్లా కమిటీ సభ్యుడు ఖండవిల్లి భరత్‌కుమార్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని లొల్లలో మేడపాటి ధనమ్మపై ఆమె భర్త మేడపాటి చంద్రశేఖర్ ఇనుపరాడ్డుతో దాడి చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ధనమ్మపై భర్త చేసిన దాడిని భరత్‌కుమార్ బుధవారం ఖండించారు. ధనమ్మతో పాటు ఆమె తల్లిదండ్రులు రవ్వా లక్ష్మీనారాయణమ్మ, వెంకన్నపై కూడా అల్లుడు చంద్రశేఖర్ దాడి చేసి గాయపర్చిన ఘటనను భరత్‌కుమార్ ఖండించారు. చంద్రశేఖర్‌పై దివ్యాంగుల హక్కుల చట్టం 2016, 92(ఎ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధనమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు.

నాటు సారా తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

కపిలేశ్వరపురం: నాటు సారాను తయారు చేస్తున్నట్టు అందుకున్న సమాచారం మేరకు మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని లంక వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 19న అంగర పోలీసులు దాడి చేశారు. ఎస్సై అందే పరదేశి ఘటనా స్థలంలో రూ.3వేలు విలువైన 10 లీటర్ల నాటు సారా, మూడు పాత్రలు, పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. కట్టెల పొయ్యి, ప్లాస్టిక్ డ్రమ్ములను ధ్వంసం చేశారు. నిందితులు కరుపోతు ప్రశాంత్‌కుమార్, పొద్దోక వెంకటవర్మను అరెస్టు చేసి ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించినట్టు బుధవారం ఎస్సై పరదేశి తెలిపారు.

వరిలో అధిక దిగుబడి సాధించాలి

ఆలమూరు: సాగుబడిలో వరి రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు పలు సూచనలు అందజేశారు. పంట కోత కోసే దశకు వచ్చినందున ప్రస్తుతం రైతులు అవలంబిస్తున్న విధానాలపై ఆరా తీశారు. వేసవిలో నీటి ఎద్దడి కారణంగా వచ్చే సమస్యలపై ఆందోళన చెందవద్దన్నారు, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ సమన్వయంతో రైతుల సమస్యలను పరిష్కరిస్తాయన్నారు. రబీ సాగులో ససరక్షణ చర్యలు పాటించడం ద్వారా చీడపీడలు నివారించవచ్చన్నారు. ఈ సీజన్‌లో ఎకరాకు సుమారు 50–55 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వ్యవసాయ శాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సిబ్బంది పాటించాల్సిన నియమాలను వివరించారు. ఏడీఏ కె.నాగేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి సోమిరెడ్డి లక్ష్మీలావణ్య, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ..!



కె.గంగవరంలో కారుమబ్బులతో నిండిన ఆకాశం



భారీ వర్షంతో జలమయమైన కె.గంగవరంలోని ఓ వీధి



గొల్లపాలెంలో కురుస్తున్న భారీ వర్షం

కె.గంగవరం: సూర్యుడి ప్రతాపంతో అల్లాడుతున్న పల్లె ప్రజానీకం బుధవారం కురిసిన వర్షం కాస్తంత సేదతీరారు. ఉదయం నుంచీ ఆకాశం నల్లని మబ్బులతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. పచ్చని కొబ్బరి చెట్ల మీదుగా మేఘావృతమైన నింగి ప్రజలను కనువిందు చేసింది. ఎండవేడితో సతమతమవుతున్న ప్రజలకు చల్లని గాలులు ఊరటనిచ్చాయి. చిన్నారులు కేరింతలు కొడుతూ చల్లదనాన్ని ఆస్వాదించారు. సాయంత్రం వరకూ ఈదురుగాలులతో కూడిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ అకాల వర్షానికి రైతులు కలవరపడ్డారు. పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వారంటున్నారు. ఇటీవల కొన్ని గ్రామాల్లో తెగుళ్లు, దోమల నివారణకు మందులను పిచికారీ చేశారు. ఈ వర్షం కారణంగా ఆ మందులు వృథా అవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

కాజులూరు: కాజులూరు మండల గ్రామాల్లో బుధవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచే భానుడు ఉగ్రరూపం దాల్చగా, మధ్యాహ్నం ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు మొదలయ్యాయి. కొద్ది రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతుండగా.. బుధవారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు కాస్తంత సేదతీరారు. సాయంత్రానికి చిరుజల్లులు కాస్తా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంగా మారి, రాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాలు దుబ్బుకట్టే దశ నుంచి చిరుపొట్ట దశలో ఉన్నాయి. సాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న కాలువ శివారు భూములకు వర్షం కాస్త మేలు చేసినప్పటికీ, పంటపై మొవ్వ పురుగు, మాగుడు తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కార్యకర్తల సమన్వయానికి పార్టీ కార్యాలయం దోహదం



ద్వారపూడిలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



ద్వారపూడిలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల మధ్య సమన్వయానికి పార్టీ కార్యాలయం దోహదపడుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఆయన చేతుల మీదుగా మండపేట మండలం ద్వారపూడిలో బుధవారం గ్రామ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు దంతులూరి శ్రీరామవర్మ, సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, మాజీ ఎంపీపీ అడబాల బాబ్జి, మాజీ ఉప సర్పంచ్ పంతంగి లలితా సుందర్ల సమక్షంలో పార్టీ కార్యాలయంలోకి ప్రవేశించారు. రెండు నెలలు పాటు కొనసాగే ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తూ కార్యాలయ కార్యకలాపాలను కొనసాగించాలని గ్రామ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ తోట సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొనిశెట్టి ఆంజనేయులు, యరగతపు విజయ్‌కుమార్, పోతుల రాంబాబు, నామాల పెద్ద వెంకన్న, సత్తి రాంబాబు, కేవీ రమణ, సత్తిపండు, చిన్నబాబు, సంజీవ్, పాండ్రంగి మహేష్, ఆలీషా, కొండపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడిలో బుధవారం టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామంలో టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ అడబాల బాబ్జి, మాజీ ఉప సర్పంచ్ పంతంగి లలితా సుందర్, వారితో పాటు టీడీపీ సీనియర్ నాయకులు బండారు చంద్రశేఖర్, బుద్దాల నాగశ్రీ, చింతా పెద్ద సత్తిబాబుతో సహా 70 మంది పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పోలినాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ జనసేన పార్టీలకు చెందిన 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఈతకోట రవికిశోర్ ఆధ్వర్యంలో 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్సీ తోట తిమూర్తులు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు తదితరులు అభినందించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పార్టీలో చేరినవారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాలంపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు దంతులూరి శ్రీరామవర్మ, సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు సత్తి సత్తిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్‌చిక్కాల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ జి. రమణ, ఎంపీటీసీ పాండ్రంగి జట్లయ్య, పోలినాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు



సీతారాములకు పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీపీ నాగమణి, ఎంపీటీసీ లక్ష్మణ్ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం బురుగుంట చెరువు వద్ద గల సీతారామ క్షేత్రంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వరదాచార్యులు పర్యవేక్షణలోని అర్చక స్వాములు ఆధ్వర్యంలో సీతారాములకు పంచామృతాభిషేకం, తులసి పూజ చేశారు. మల్లిపూడి వెంకటేశ్వరరావు దంపతులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం: దంగేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం వద్ద సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ స్వామివారిని దర్శించుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్, ఆలయ కమిటీ ప్రతినిధులు పితాని శ్రీనివాస్, పిలివెల రామకృష్ణ, వాసంశెట్టి ఆంజనేయులు, అనుసూరి గోవిందు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా స్వామివార్ల కల్యాణం



వెల్లలో స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రామచంద్రపురం రూరల్: వెల్ల గ్రామంలో ఉన్న బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత గోపాలస్వామి, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివార్ల దివ్య కల్యాణం రాత్రి 7.37 గంటలకు జరిగింది. వేద పండితులు చావలి సోమేశ్వరరావు, అంగర విజయ వెంకట సూర్యనారాయణాచార్యులు బ్రహ్మత్వంలో కన్నులపండువగా కల్యాణం జరిపారు. ఆలయ ఈఓ, ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ



కపిలేశ్వరపురంలో ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బు తదితరులు

కపిలేశ్వరపురం: స్థానికంగా నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా సాగింది. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు చేతుల మీదుగా బుధవారం ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

కన్నుల పండువగా రథోత్సవం

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆలయం వద్ద రథంపై దేవతా మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు భక్తులతో పూజలు చేయించారు. ఉత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్ ముత్తా అబ్బు రథ యాత్రను ప్రారంభించారు. అంగర పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు రథాన్ని లాగారు. ఇరు గ్రామాల ప్రధాన రహదారి మీదుగా గ్రామ శివారు పోలేరమ్మ ఆలయం వరకూ యాత్ర కొనసాగింది. పోలేరమ్మ ఆలయం వద్ద తీర్థం నిర్వహించారు.

ఉచిత దంత వైద్య శిబిరాలు



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ క్రాంతికుమార్

రామచంద్రపురం రూరల్: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అన్నాయిపేట, వెలంపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ద్రాక్షారామకు చెందిన భీమేశ్వర దంత వైద్యశాల వైద్యుడు బచ్చు క్రాంతికుమార్ ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో సుమారు 200 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించి, వారికి అవసరమైన మందులు, టూత్‌పేస్టులు అందజేశారు. హెచ్ఎంలు ముత్తయ్య, జానకీరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కల్పవృక్ష, సర్వభూపాల వాహనోత్సవాలు

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాల్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం హనుమత్ హోమం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చనం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని కల్పవృక్ష వాహనంపై గోవింద మాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు వాడపల్లి కమలనాథ్ ఆచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిపారు. రాత్రికి స్వామివారికి సర్వభూపాల వాహనోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి, సభ్యులు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



పాలతోడులో పార్టీ నాయకులతో చర్చిస్తున్న పాపారాయుడు, శ్రీనివాస్, వీరబాబు

కపిలేశ్వరపురం (మండపేట): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటు, మండపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు అన్నారు. మండలంలోని మెర్నిపాడు, పాలతోడు, ఇప్పనపాడు గ్రామాల్లో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో వారు బుధవారం సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి ఎన్నికల ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతుల దుర్గాప్రసాద్, గారపాటి అశోక్ కుమార్, పిల్లా అరవ రావు, త్రిశూల శ్రీను, త్రిశూల అప్పారావు, చిన్ని గంగాధరం, చిటికిన వీర్రాజు, యనమదల సత్యనారాయణ, గుత్తుల సూర్యనారాయణ, అనంతవరపు వెంకట్రావు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

వైభవంగా గణపతి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: మాచవరం శివారు పోతాయిలంక గ్రామంలో ఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద సిద్ధి గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ఠను బుధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు కారుపర్తి తేజాశర్మ పర్యవేక్షణలో మట్టపర్తి వెంకటేశ్వరరావు, కనకదుర్గ, వీరి కుమారులు శ్రీధనరాజ్, పూజా కైరవ్ రాజ్, సాయిరామ్, సాయిరత్నశ్రీ దంపతులతో పాటు, స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమం, పుణ్యాహవచనం, విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద అన్న సమారాధన జరిగింది.

పెద్దింట్లమ్మ సన్నిధిలో కుంకుమార్చనలు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు తోట మెరకలో కొలువు తీరిన పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చనలు జరిగాయి. భారీగా హాజరైన మహిళలకు ఆలయ కమిటీ పూజా సామగ్రిని ఉచితంగా అందించింది. వేదమంత్రాల నడుమ అమ్మవారికి పలు ప్రత్యేక పూజలు జరిపించారు. నెల రోజుల పాటు జరిగే అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పూజల అనంతరం అమ్మవారి కల్యాణం భక్తుల కోలాహలం నడుమ జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. గురువారం అమ్మవారి ప్రభ ఊరేగింపు, ఈ నెల 26న అమ్మవారి జాతర జరుగుతాయి.

సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం

మామిడికుదురు: మాకనపాలెంలోని అనంతలక్ష్మి, భూదేవి సమేత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భక్త దంపతులు సలాది వెంకటేశ్వరరావు, నాగమణి.. అనంతలక్ష్మి, శ్రీదేవి అమ్మవార్లతో పాటు, సత్యనారాయణ స్వామి వార్లను పెళ్లి కుమార్తెలు, పెళ్లి కుమారుడిగా అలంకరించారు. స్వామివారి 72వ దివ్య తిరు కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భారీగా విద్యుత్ అలంకరణలతో ఆలయాన్ని తీర్చిదిద్దారు. ఈ నెల 25 వరకూ కల్యాణోత్సవాలు జరుగుతాయి. గురువారం నుంచి ఉదయం వ్రతాలు, అభిషేకాలు, మొక్కులు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది. గురువారం రాత్రి 12 గంటలకు స్వామివారి దివ్య తిరు కల్యాణం జరుగుతుందని పేర్కొంది.

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

అంబాజీపేట: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నందున పన్ను వసూళ్లను నూరు శాతం పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎల్పీఓ పి.బొజ్జరాజు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందితో ఇంటి పన్నుల వసూళ్లపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్పీఓ బొజ్జరాజు మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి ఇంటి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పన్ను వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యాలను అధికమించి, నూరు శాతం వసూలు జరిగేలా చూడాలన్నారు. ప్రజలు కూడా ఇంటి పన్నులు చెల్లించి సహకరించాలన్నారు. ప్రజలు చెల్లించే పన్నులతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. చట్ట ప్రకారం వ్యాపార సముదాయాలు, ఇతర అంశాలపై రాజకీయ నాయకుల ప్రచార బోర్డులు తొలగించాలని ఆదేశించారు. కోడ్ కాండక్ట్ అమల్లోకి వచ్చినందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ బి.మమత, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణలో నిర్లక్ష్యం తగదు

- అగ్ని ప్రమాదాల్లో తరచూ పశువుల మృతి, ఆస్తి నష్టం
- పొలాల్లో గడ్డి తగలబెట్టడమూ ఓ కారణమే..
- అగ్నిమాపక కేంద్రాల్లో సిబ్బంది కొరత!



వెదురుమూడి పశువులపాక దగ్ధం కావడంతో చనిపోయిన పాడి పశువు (ఫైల్)

కపిలేశ్వరపురం: పల్లెవాసుల జీవితం పశువులతో మమేకమై ఉంటుంది. చాలా మంది రైతులకు పశువులు ఆదాయ వనరుగా ఉపయోగపడుతున్నాయి. అలాంటి పశువులను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉంది. వేసవిలో ఆ బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. వేసవిలో పశువుల పాకలు, గడ్డివాములు తరచూ దగ్ధమవుతుంటాయి. అలాంటి క్రమంలో పశువులు సైతం ప్రమాదాలకు గురై చనిపోతుంటాయి. ఈ సందర్భంగా ప్రస్తుత వేసవిలో పశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి.

అగ్నిమాపక కేంద్రం సామర్థ్యమిదే..

ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అగ్నిమాపక కేంద్రం చొప్పున రెండు కేంద్రాలున్నాయి. మండపేట కేంద్రం సిబ్బంది మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, ఆలమూరు, తూర్పుగోదావరి జిల్లాలోని కడియం, అనపర్తి మండలాల పరిధిలో 60 గ్రామాల్లో సేవలందిస్తున్నారు. ఈ కేంద్రంలో గతంలో 9మంది ఫైర్‌మెన్లు ఉండగా ప్రస్తుతం ఏడుగురు పని చేస్తున్నారు. ఇద్దరు డ్రైవర్లు ఉండగా మరో పోస్టు ఖాళీగా ఉంది. రామచంద్రపురం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది రామచంద్రపురం పట్టణం, రూరల్ గ్రామాలు, కె.గంగవరం, కరప, బిక్కవోలు, రాయవరం మండలాల్లోని 105 గ్రామాలకు సేవలందిస్తున్నాయి. కేంద్రంలో 9 మంది ఫైర్‌మెన్లు ఉండాల్సి ఉండగా నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు కేంద్రాల సామర్థ్యం, సిబ్బంది సంఖ్య పెంచాలని రైతులు కోరుతున్నారు.

మానవ తప్పిదాలతో..

వ్యవసాయ క్షేత్రాల్లోనూ, పశువుల మకాంలలోనూ మానవ తప్పిదాలు కారణంగా పశువులు ప్రమాదాలకు గురవుతున్నాయి. గతేడాదిలో పలు ప్రాంతాల్లో సంభవించిన ప్రమాదాల్లో పశువులు మృత్యువాత పడ్డాయి. 2023 ఫిబ్రవరి 1న రాయవరం మండలం చెల్లూరు శివారు సూర్యారావుపేటలో ఒక గేదె చనిపోగా మరో రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. 2023 మార్చి 17న కె.గంగవరం మండలం కుందూరు శివారు కుందూరులంకలో పశువుల పాక దగ్ధం కావడంతో రెండు ఒంగోలు జాతి ఆవులు చనిపోయాయి. ఆ తర్వాత సైతం అనేక ప్రమాదాలు సంభవించాయి.

పొలంలో గడ్డికి నిప్పు పెట్టడంతో..

2020 మే 20న అంగరలో రెండు ఎకరాల ధాన్యపు రాశి, మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. 2020 మే 26న కపిలేశ్వరపురం మండలం టేకిలో రెండు పశువులపాకలు దగ్ధమవడంతో ఆరు పశువులు మృతి చెందాయి. 10 ఎకరాల్లోని గడ్డివామి దగ్ధమైంది. సుమారు రూ.ఐదు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. 2019 మే 16 రాయవరం చెల్లూరులో పశువుల పాక దగ్ధమై ఒక పాడి గేదె చనిపోయింది. 2019 మే 17న కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామ శివారు తాళ్లపాలెం పుంత ఓఎన్‌జీసీ వద్ద గ్రామంలో పశువుల పాక దగ్ధమై రెండు గేదె దూడలు మృత్యువాత పడ్డాయి. మరో రెండు పాడి గేదెలకు 50 శాతం గాయాలయ్యాయి. ఒక గేదె స్వల్ప గాయాలతో బయటపడింది. రూ.2.40 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. 2018 మే 5న రాయవరం మండలం వెదురుపాకలో సంభవించిన ప్రమాదంలో 12 ఎకరాల్లోని ధాన్యం రాశులు అగ్నికి ఆహుతయ్యాయి.

అగ్నిమాపక దళ సిబ్బందికి ఇబ్బందులు

వ్యవసాయ క్షేత్రంలో మంటలను ఆర్పడం అగ్నిమాపకదళ సిబ్బందికి ఎంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. విశాలమైన వ్యవసాయ క్షేత్రంలో నిప్పు రాజుకోగానే క్షణాల్లో ప్రమాద తీవ్రత పెరిగిపోతుంది. ప్రమాద ఘటనా స్థలం వ్యవసాయ క్షేత్రం కావడంతో వాహనం నుంచి దూరంగా నీళ్లను చల్లడం సమస్యతో కూడుకున్నది. ఒకే సమయంలో రెండు చోట్ల ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బందికి ఏమీ పాలుపోని పరిస్థితి తలెత్తుతోంది.

నారసింహ సుదర్శన హోమం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమానికి భక్తులు పోటెత్తారు. మనోవాంఛా ఫలసిద్ధి కోసం, సర్వగ్రహ దోష నివారణకు భక్తులు సుదర్శన హోమంలో పాల్గొని, స్వామిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. స్వామివారి సన్నిధిలో నవ బుధవార, నవ ప్రదక్షిణ దీక్ష చేస్తే లక్ష్మీనృసింహస్వామి కోరిన కోర్కెలు తీరుస్తాడని అర్చకులు తెలిపారు.